PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY


సంపుటి: 01 సంచిక :113 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : గురువారం - 08 అక్టోబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:113 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: THURSDAY 08 OCTOBER 2026 PAGES: 04 RS:01/


రెపో రేటు 5.50 శాతానికి

పెంపు

● 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ ● ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక ● ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం ● ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!! ● 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు ● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి ● ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు ● ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్



న్యూఢిల్లీ: అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): వడ్డీ రేట్ల పెరుగుదలతో రుణాలు తీసుకున్న వారిపై అదనపు ఆర్థిక భారం పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో కుటుంబ బడ్జెట్లు ఒత్తిడికి గురవుతున్న సమయంలో మిగతా2లో...



ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ చాన్స్?

అమరావతి, 7(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం మిగతా2లో...

నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

● కోట్లాది మంది విశ్వాసమే నా అతిపెద్ద బలం

● దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

● విఘ్నహర్త ఆశీస్సులతో దేశం ప్రగతిపథంలో సాగాలి

● 25 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే మిగతా2లో...

మోదీ పాలనా ప్రస్థానానికి 25 ఏళ్లు

దేశాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తున్నారు: లోకేశ్



అమరావతి, 7(నేటి మినిట్ టు మినిట్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆయనకు అభినందనలు తెలిపారు. గుజరాత్ నుంచి న్యూఢిల్లీ వరకు మోదీ ప్రయాణం దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, మిగతా2లో...


టెన్షన్.. టెన్షన్

ఢిల్లీలో ఉద్రిక్తంగా మారిన ఇండియా బ్లాక్ మార్చ్

ఎంపీలు, మహిళా కార్యకర్తల అరెస్టు.. పలువురికి గాయాలు



న్యూఢిల్లీ: అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు చేపట్టిన మార్చ్ బుధవారం ఉద్రిక్తంగా మారింది. ఢిల్లీలోని జనపథ్ నుంచి జంతర్‌మంతర్ వైపు వెళ్తున్న ఎంపీలు, కార్యకర్తలను అశోక్ రోడ్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రియాంక గాంధీ నేతృత్వంలో పలువురు మహిళా ఎంపీలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. నిరసనకారులను పోలీసులు అదుపులోకి మిగతా2లో...



తొలగించిన 46.62 లక్షల ఓట్లపై ప్రత్యేక పరిశీలన

- నేటి నుంచి ఇంటింటికీ బీఎల్ఓలు.. అర్హులైతే మళ్లీ ఓటరు జాబితాలోకి

అమరావతి, 7(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా పునఃపరిశీలనకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. గురువారం మిగతా2లో...

ఉత్తరాంధ్రకు పెట్టుబడుల ఊతం

● శ్రీకాకుళంలో విమానాశ్రయానికి భూమి క్లియరెన్స్.. భోగాపురంలో 800 ఎకరాల్లో ఏరో సిటీ



విశాఖపట్నం, అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): ఉత్తరాంధ్రలో మౌలిక వసతులు, పారిశ్రామిక రంగానికి మరింత ఊతమిచ్చే కీలక ప్రకటనలు వెలువడ్డాయి. శ్రీకాకుళంలో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూమికి ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మిగతా2లో...

హరితాంధ్రప్రదేశ్‌కు నర్సరీ రైతుల భాగస్వామ్యం

కడియం రైతులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తాం: నాగబాబు



2లో

పోరాటం ఆపేది లేదు

బీజేపీని దేశ ప్రజలు క్షమించరు..

మోదీ, అమిత్ షా నిరంకుశత్వం

ప్రజాస్వామ్యయుత ఆందోళనకు అడ్డు

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో వైదొలగాలి

ప్రధాని మోదీ రాజీనామా చేయించాలి

ఢిల్లీ పోలీసులపై సీఎం రేవంత్ ఆగ్రహం



2లో

ఉత్తరాంధ్రకు పెట్టుబడుల ఊతం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విమానాశ్రయాల ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆయా ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర ప్రాంతీయ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పలు కీలక ప్రాజెక్టులపై ప్రకటనలు వెలువడ్డాయి. అనకాపల్లిలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. భోగాపురంలో 800 ఎకరాల్లో జీఎంఆర్ ఏరో సిటీ అభివృద్ధి చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ వెల్లడించారు.

రూ.37 వేల కోట్లతో 229 ఒప్పందాలు 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ. 22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. వీటి ద్వారా 9.3 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. రూ. 5 లక్షల కోట్ల విలువైన 257 ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరుకుంటున్నాయని చెప్పారు. ప్రస్తుత సదస్సులో రూ.37 వేల కోట్ల విలువైన 229 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు, వీటి ద్వారా సుమారు 92 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. **విశాఖలో భారీ కన్వెన్షన్ సెంటర్** విశాఖలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భారీ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. భీమిలి బీచ్‌రోడ్డులోని యూనిటీ మాల్‌లో మరో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం జరుగుతోందన్నారు. విశాఖ ప్రాంతం నుంచే రాష్ట్ర పర్యాటక ఆదాయంలో సుమారు 50 శాతం వస్తోందని శ్రవణ్ షిప్పింగ్ అధినేత జి. సాంబశివరావు తెలిపారు. నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ రూ. 1.35 లక్షల కోట్లతో భారీ ప్రాజెక్టును చేపడుతోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. గూగుల్, రిలయన్స్ సంస్థలు ఏఐ, డేటా సెంటర్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు తెలిపారు.

తొలగించిన 46.62 లక్షల ఓట్లపై ప్రత్యేక పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించనున్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తొలగించిన 46,62,583 మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించనున్నారు. ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలిపోయిన వారు, ఒకటికి మించి నమోదైన పేర్లు, అందుబాటులో లేని ఓటర్లను పరిశీలనలో గుర్తించారు. జూలై 31న 3,71,38,182 మంది ఓటర్లతో ముసాయిదా జాబితా విడుదలైంది. అనంతరం నోటీసుల దశలో మరో 1,73,071 మంది అనర్హులుగా గుర్తించినట్లు సీఈవో తెలిపారు. ఇంటింటి పరిశీలనలో అర్హత ఉన్న ఓటరు పేరు పొరపాటున తొలగించినట్లు తేలితే, సంబంధిత వ్యక్తికి ఫారం-6 ద్వారా మళ్లీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులైన వారి పేర్లను నిరంతర సవరణ ప్రక్రియలో చేర్చనున్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకుంటామని వివేక్ యాదవ్ తెలిపారు. ఎస్ఐఆర్-2026 తుది ఓటర్ల జాబితాను ఈ నెల 16న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తుది జాబితా విడుదలైన తర్వాత కూడా నిరంతర సవరణ ద్వారా అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

హరితాంధ్రప్రదేశ్‌కు నర్సరీ రైతుల భాగస్వామ్యం

రాజమహేంద్రవరం, 7(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో నర్సరీ రైతుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కె. నాగబాబు అన్నారు. రాజమహేంద్రవరం కడియంలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని భారీగా పెంచేందుకు నర్సరీ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నాగబాబు తెలిపారు. నర్సరీ రైతులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పించేం దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 202627 ఆర్థిక సంవత్స రంలో రాష్ట్రవ్యాప్తంగా నర్సరీల్లో సుమారు 10 కోట్ల మొక్కలను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 500 నుంచి 1,000 వరకు నర్సరీలు అవసరమని పేర్కొన్నా రు. రాజమహే ంద్రవరం పుష్కర నగరవనంలో రుద్రా క్ష, అరుదైన అండమాన్ పడాక్ మొక్కలను నాగబాబు నాటారు. అనంతరం కడియం నర్సరీలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి లక్ష్యమని ఆయన తెలిపారు.

పోరాటం ఆపేది లేదు

న్యూఢిల్లీ,అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ముఖ్య నాయకులను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాఖంబ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన తనను కూడా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే దేశ ప్రజలు బీజేపీని ఏమాత్రం క్షమించరని ఘాటుగా హెచ్చరించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరు అత్యంత వివాదాస్పదంగా మారిందని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల్లో పెరిగిపోతున్న అసహనానికి ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమని, ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు రాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

ఢిల్లీలో భవనం కూలి విషాదం

- ముగ్గురు మృతి..

8 మందికి గాయాలు

న్యూఢిల్లీ,అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): దేశ రాజధాని ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం భారీ భవనం కూలిన ఘటన విషాదం నింపింది. బహుళ అంతస్తుల భవనం కుప్పకూలడంతో ముగ్గురు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. మృతుల్లో ఒక చిన్నారి ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.సీమాపురిలోని మత్స్య మార్కెట్ సమీపంలో మధ్యాహ్నం సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, పౌర రక్షణ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ మరికొందరు లోపల చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు కొనసాగించారు.ప్రమాదం కారణంగా సీమాపురి గోల్‌చక్కర్, డీఎల్ఎఫ్ భోపురా, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సహాయక, అంబులెన్స్ వాహనాలు వేగంగా ఘటనాస్థలికి చేరుకునేందుకు మార్గాలను ఖాళీగా ఉంచాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

భవనం కూలడానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, ఘటనలో గాయపడిన వారిలో చిన్నారులు కూడా ఉన్నట్లు సమాచారం. శిథిలాల తొలగింపు, గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతులు, క్షతగాత్రుల సంఖ్యపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు



రాజమండ్రి, అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ తుది దశకు చేరుకున్న సమయంలో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, ముందుగా హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. కేసు విచారణ అత్యంత వేగంగా సాగుతోందని, మొత్తం 87 మంది సాక్షుల్లో అత్యధికుల విచారణ ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయడం సముచితం కాదని ఆయన తన వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విచారణ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనంతబాబు భార్య చేసిన అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఈ సందర్భంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుని హైకోర్టును ఆశ్రయించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. విచారణను రోజువారీ పద్ధతిలో కొనసాగించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో, వీడియో ఫైల్స్, డిజిటల్ ఆధారాలకు సంబంధించిన మరో అనుబంధ పిటిషన్‌ను కూడా పిటిషనర్ తరఫు వారు ఉపసంహరించుకున్నారు. గతంలో బెయిల్‌పై విడుదలైన అనంతబాబుకు... సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో బెయిల్ రద్దు కావడంతో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

రుణాలపై వడ్డీ భారం మరింత పెరిగితే మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారికి నెలవారీ ఈఎంఐలు పెరిగే ప్రమాదం ఉంది.ద్రవ్యోల్బణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనుంది. ద్రవ్యోల్బ ణాన్ని అదుపులో ఉంచేందుకు వడ్డీ రేట్లను పెంచితే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే ఖర్చు పెరుగుతుంది. ఇప్పటికే రుణాలు కొనసాగుతున్న వారికి కూడా వడ్డీ రేట్ల మార్పుల ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కుటుంబ ఆదాయంలో ఎక్కువ భాగం రుణ చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.గృహ రుణాలు తీసుకున్న వారిపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వడ్డీ రేట్లు పెరిగితే బ్యాంకులు ఈఎంఐలను పెంచడం లేదా రుణ కాలపరిమితిని పొడిగించడం వంటి చర్యలు చేపట్టవచ్చు. ఈఎంఐ పెరిగితే నెలవారీ ఖర్చులు పెరుగుతాయి. కాలపరిమితి పెరిగితే మొత్తం రుణంపై చెల్లించాల్సిన వడ్డీ మరింత పెరిగే అవకాశం ఉంటుంది.వ్యాపార రంగం పైనా అధిక వడ్డీ రేట్ల ప్రభావం పడుతుంది. పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థలు పెట్టుబడులు, విస్తరణ కోసం బ్యాంకు రుణాలపై ఆధారపడుతుంటాయి. రుణ వ్యయం పెరిగితే కొత్త పెట్టుబడులపై నిర్ణయాలను వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చు. చిన్న, మధ్య తరహా సంస్థలకు ఇది మరింత భారంగా మారే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.మరోవైపు ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే వడ్డీ రేట్లపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. ఆహార ధరలు, ముడిచమురు ధరలు, వర్షపాతం, దేశీయ ఆర్థిక పరిస్థితులతో పాటు అంతర్జాతీయ పరిణామాలను రిజర్వ్ బ్యాంక్ పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకోనుంది. వడ్డీ రేట్ల విషయంలో ఆర్‌బీఐ తీసుకునే నిర్ణయం రుణగ్రహీతలు, బ్యాంకులు, వ్యాపార రంగంపై గణనీయమైన ప్రభావం చూపనుంది.ఇప్పటికే రుణాలు ఉన్నవారు తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఖర్చులను నియంత్రించుకోవడంతో పాటు రుణ చెల్లింపులపై ముందస్తు ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. వడ్డీ రేట్ల మార్పులు కొనసాగుతున్న నేపథ్యంలో కొత్తగా రుణాలు తీసుకునే వారు కూడా ఈఎంఐ, వడ్డీ భారం, రుణ కాలపరిమితిని సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే 'భాగస్వామ్య సదస్సు' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం రేపు రాత్రికి ఆయన ఢిల్లీ నుంచి తిరిగి అమరావతికి బయలుదేరనున్నారు.

నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

(మొదటి పేజీ తరువాయి)

నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు.

మోదీ పాలనా ప్రస్థానానికి 25 ఏళ్లు

(మొదటి పేజీ తరువాయి)

దేశాభివృద్ధిపై నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత ఆత్మవిశ్వాసంతో, గౌరవప్రదంగా ఎదుగుతోందని లోకేశ్ అన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధన దిశగా మోదీ ఆలోచనా విధానం, నిర్ణయాలను అమలు చేసే తీరు ప్రజాజీవితంలో ఉన్నవారికి స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు చిన్న విషయాలపై కూడా దృష్టి సారించి, భారీ స్థాయిలో కార్యక్రమాలను అమలు చేయగల సామర్థ్యం మోదీకి ఉందని లోకేశ్ ప్రశంసించారు. ప్రధానమంత్రి మరిన్ని సంవత్సరాలు దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు.మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో లోకేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

టెన్షన్.. టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పలువురు ఎంపీలు, కార్యకర్తలను అరెస్టు చేసి వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనల్లో పలువురికి గాయాలు కాగా, కొందరి దుస్తులు చిరిగిపోయాయి. అరెస్టయిన ఎంపీలు పోలీస్‌స్టేషన్లలోనూ తమ నిరసన కొనసాగించారు.బారాఖంబా పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి సతీశన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాంగ్రెస్ నేతలు భారీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల అనంతరం రాహుల్‌గాంధీతో పాటు ఇండియా బ్లాక్ ఎంపీలను పోలీసులు విడుదల చేశారు.నిరసనల నేపథ్యంలో ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. జంతర్‌మంతర్ పరిసరాల్లో ఆంక్షలు విధించడంతో పాటు పలు ప్రధాన మార్గాలను మూసివేశారు. దీంతో నగరంలో ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది. ఢిల్లీ పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, ఆర్ఎఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ బలగాలను మోహరించారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను ప్రతిపక్ష నేతలు పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఆందోళన కొనసాగుతుందని కాంగ్రెస్, ఇతర ఇండియా బ్లాక్ నేతలు స్పష్టం చేశారు.

‘ బోన్ టెస్టింగ్ జరిగిందా బ్రదర్...? ’

అండర్-16 ఎంపికలపై తల్లిదండ్రుల తీవ్ర ఆరోపణలు

ప్రతిభకు చోటేదీ? పైసలకే ప్రాధాన్యమా..?

వయసు ధ్రువీకరణపై అనుమానాలు

డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఎంపికల తీరుపై విచారణ జరపాలని డిమాండ్



అనంతపురం, అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం జిల్లా క్రికెట్‌లో ప్రతిభావంతులైన క్రీడాకారులకు సరైన అవకాశాలు దక్కడం లేదంటూ పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అండర్-14, అండర్-16, అండర్-19 జట్ల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని, కొందరు క్రీడాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిభ ఆధారంగా ఎంపికలు జరగాల్సిన చోట ఇతర ప్రభావాలు పనిచేస్తున్నాయన్న అనుమానాలను తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత క్రికెట్ అసోసియేషన్, సెలెక్టర్లు అధికారికంగా స్పందించాల్సి ఉంది. **కనిపించని ప్రతిభ.. కనిపిస్తున్న పైసలా?** క్రికెట్‌లో ప్రతిభ ఉన్నప్పటికీ ఎంపికల్లో అవకాశం దక్కడం లేదని కొందరు యువ క్రికెటర్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కొందరు క్రీడాకారులకు వరుస అవకాశాలు వస్తుండగా, మెరుగైన ప్రదర్శన చేస్తున్న మరికొందరిని పక్కన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. “పిల్లల ప్రతిభను గుర్తించి అవకాశం ఇవ్వాలి.. ఎవరి సిఫార్సులు, పరిచయాలు, ఆర్థిక ప్రభావాలకు తావుండకూడదు” అని తల్లిదండ్రులు కోరుతున్నారు. **‘పైసా మే పరమాత్మా?’.. ఎంపికల్లో డబ్బు ప్రభావంపై ఆరోపణలు**అండర్-16 ఎంపికల విషయంలో డబ్బు, సిఫార్సులు, పరిచయాలు ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.కొంతమంది క్రీడాకారులకు పదేపదే అవకాశాలు లభిస్తుండగా, ప్రతిభ ఉన్నప్పటికీ మరికొందరికి ఛాన్స్ రావడం లేదని తల్లిదండ్రులు అంటున్నారు. “సెలక్షన్‌కు ప్రమాణం ప్రతిభా? లేక పరిచయాలా?”అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అనేది తేలాలంటే గత కొన్నేళ్ల సెలక్షన్ రికార్డులు, ఆటగాళ్ల ప్రదర్శనలు, సెలక్షన్ ప్రమాణాలు, స్కోర్‌కార్డులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. **ఒక్క టెస్ట్ అయినా సక్రమంగా జరుగుతోందా?**జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికల్లో ట్రయల్స్, ఫిట్‌నెస్ పరీక్షలు, మ్యాచ్ ప్రదర్శనలు, స్కోరింగ్ వంటి అంశాలను పారదర్శకంగా నిర్వహించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే ఎంపిక పరీక్షలు సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ట్రయల్స్ ఎప్పుడు నిర్వహించారు? ఎవరెవరు పాల్గొన్నారు? ఎలాంటి ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేశారు? ఎంపికైన వారి ప్రదర్శన ఎంత? పక్కన పెట్టబడిన ఆటగాళ్లకు కారణం ఏమిటి? అన్న వివరాలను బహిరంగంగా ప్రకటించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. **‘బోన్ టెస్టింగ్’ జరిగిందా? వయసు ధ్రువీకరణపై అనుమానాలు**అండర్-14, అండర్-16, అండర్-19 విభాగాల్లో వయసు అర్హత అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో వయసు ధ్రువీకరణ ప్రక్రియపై కూడా పలువురు తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు తదితర అధికారిక రికార్డులను పరిశీలిస్తున్నారా? అవసరమైన సందర్భాల్లో వర్తించే నిబంధనల ప్రకారం వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.“వయసు విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేకుండా ప్రతి క్రీడాకారుడి అర్హతను నిష్పక్షపాతంగా పరిశీలించాలి” అని తల్లిదండ్రులు కోరుతున్నారు. **ఆధార్‌లో వయసు మార్పులు చేస్తున్నారా?** కొందరు ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇవి తీవ్రమైన ఆరోపణలు కావడంతో వాటిని అధికారిక రికార్డులతోనే నిర్ధారించాల్సి ఉంటుంది. అసోసియేషన్ అధికారులు ప్రతి క్రీడాకారుడి వయసు ధ్రువీకరణ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని, అనుమానాలుంటే స్వతంత్రంగా విచారణ నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **‘కులం క్రికెట్’ అంటూ కొత్త వివాదం?**అనంతపురం క్రికెట్ ఎంపికల్లో కులం, పరిచయాలు, ప్రభావాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు కూడా కొందరి నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఇటువంటి ఆరోపణలకు ఆధారాలు ఉంటే సంబంధిత అధికారులు వాటిని పరిశీలించాల్సి ఉంటుంది. క్రికెట్‌లో ఆటగాడి ఎంపిక కేవలం అతని ప్రతిభ, ప్రదర్శన, ఫిట్‌నెస్ ఆధారంగానే జరగాలి అనే డిమాండ్ తల్లిదండ్రుల నుంచి వస్తోంది. **పుట్టగొడుగుల్లా క్రికెట్ అకాడమీలు.. ప్రతిభకు మాత్రం కొరత?** అనంతపురం నగరంలో ఇటీవలి కాలంలో అనేక క్రికెట్ అకాడమీలు ఏర్పడ్డాయి. వందలాది మంది చిన్నారులు, యువకులు క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. ఇంతటి ప్రతిభ అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లా స్థాయి జట్లలో సరైన ఫలితాలు రావడం లేదని కొందరు క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు. అకాడమీలు పెరుగుతున్నాయి.. క్రీడాకారులు పెరుగుతున్నారు.. మరి జిల్లా జట్ల ప్రదర్శన ఎందుకు మెరుగుపడటం లేదు? అనే ప్రశ్నకు క్రికెట్ అసోసియేషన్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. **అడుతారు.. ఓడిపోతారు.. అయినా మళ్లీ వారికే ఛాన్స్?** వరుసగా జరిగే పోటీల్లో ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వని కొందరు క్రీడాకారులకు పదేపదే అవకాశాలు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో ఒక్కసారి లేదా రెండుసార్లు అవకాశం దక్కిన ప్రతిభావంతులు సరైన ప్రదర్శన చేసే అవకాశం లేకుండానే పక్కన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. “ఓటమికి బాధ్యత ఎవరిది? ఎంపిక చేసిన వారిదా? లేక సెలక్షన్ విధానానిదా?” అని క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు. **‘సెలెక్టర్లను ప్రలోభపెడుతున్నారు’.. సంచలన ఆరోపణలు**కొంతమంది వ్యక్తులు సెలెక్టర్లపై ప్రభావం చూపేందుకు డబ్బు, ఇతర ప్రయోజనాలు లేదా పర్యటనల వంటి ప్రలోభాలు చూపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఈ ఆరోపణలు నిజమైతే క్రికెట్ ఎంపిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అందువల్ల సెలెక్టర్ల ఎంపిక, వారి బాధ్యతలు, ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా ఉండాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. **‘ప్రతిభ ఉన్నా ఆటో తోలుకోవడం మేలు’.. యువ క్రికెటర్ల ఆవేదన** అవకాశాలు రాక, సరైన గుర్తింపు దక్కక కొందరు ప్రతిభావంతులైన యువకులు క్రికెట్‌ను వదిలేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “క్రికెట్ ఆడటం కంటే ఏదైనా పని చేసుకోవడం మేలేమో” అనే స్థాయికి యువ క్రీడాకారులు నిరాశ చెందడం బాధాకరమని వారు అంటున్నారు. ఒక ఆటగాడి ప్రతిభను కేవలం ఎంపిక జాబితాతో కొలవకూడదని, అతనికి నిష్పక్షపాతంగా అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత అసోసియేషన్‌పై ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. **మంత్రులు, ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు.. స్పందన ఎక్కడ?** ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులకు క్రికెట్ ఎంపికలపై ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన కనిపించలేదని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. “మా పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు లేరు” అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఈ వ్యవహారాన్ని క్రీడా సమస్యగా మాత్రమే కాకుండా వందలాది మంది యువ క్రీడాకారుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంగా పరిగణించి సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. **జిల్లా క్రికెట్‌లో పారదర్శకతకు పెద్ద పీట వేయాలి** అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ప్రతిభావంతులైన క్రికెటర్లు ఎదగాలంటే ఎంపిక వ్యవస్థలో పారదర్శకత అత్యవసరం. **చివరికి ప్రశ్న ఒక్కటే.. ‘క్రికెట్‌లో ప్రతిభ గెలుస్తుందా? పైసా గెలుస్తుందా?’** అనంతపురం జిల్లాలో క్రికెట్‌కు ఎంతో చరిత్ర ఉంది. నేటి చిన్నారుల్లో రేపటి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెటర్లు ఉన్నారు. అలాంటి సమయంలో ఎంపికలపై ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే అంశం. ప్రతిభ ఉన్నవాడికి అవకాశం దక్కాలి.. అర్హత ఉన్నవాడే జట్టులో ఉండాలి.. వయసు నిబంధనలు అందరికీ ఒకేలా వర్తించాలి. అందుకే ప్రస్తుతం అందరి చూపు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైపే ఉంది. **“బోన్ టెస్టింగ్ జరిగిందా.. బ్రదర్?”** “సెలక్షన్‌లో నిజంగా ప్రతిభకే చోటా?” “అండర్-16లో జరుగుతున్నాయంటున్న ఆరోపణలపై విచారణ ఎప్పుడు?” అన్న ప్రశ్నలకు సంబంధిత క్రికెట్ అసోసియేషన్, సెలెక్టర్లు, రాష్ట్రస్థాయి అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఆటగాడి భవిష్యత్తుతో ఆటలాడకుండా.. క్రికెట్ ఎంపికల్లో పారదర్శకత తీసుకురావాలని అనంతపురం జిల్లా క్రీడాభిమానులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సుజాతమ్మ ఫోన్‌పే కథ..!



ఉపాధి హామీలో ఫోన్‌పే ఫైల్.. సుజాతమ్మ వివరణతో కొత్త చర్చ

తప్పు చేస్తే చర్యలు ఖాయం : పీడీ హెచ్చరిక

స్టేషనరీ ఖర్చులేనా..? వైరల్ స్క్రీన్‌షాట్లపై ప్రశ్నల వర్షం

బ్యాంకు ఖాతాల పరిశీలనకూ సిద్ధం అంటున్న అధికారులు

‘సుజాతమ్మ ఫోన్‌పే కథ’ సోషల్ మీడియాలో హాట్ టాపిక్

విచారణ తర్వాతే నిజాలు వెలుగులోకి వస్తాయంటున్న అధికారులు

ప్రజాధనం, వ్యక్తిగత లావాదేవీలు.. అసలు నిజం ఏది?

ఉపాధి హామీ పథకంలో ఆరోపణలు వివరణలతో మరింత చర్చ

ఏపీవో సుజాతపై వస్తున్న ఆరోపణలపై పీడీ స్పందన

అనంతపురం, అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): ఉపాధి హామీ పథకంలో ఏపీవో సుజాతపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా పీడీ మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. ఫిర్యాదులు, ఆరోపణలపై సమగ్ర విచారణ చేపడతామని, తప్పు చేసినట్లు తేలితే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే సంబంధిత వ్యక్తుల బ్యాంకు ఖాతాల వివరాలను కూడా పరిశీలించే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. **సుజాత వివరణ మరోలా..!** ఇదే సమయంలో ఏపీవో సుజాత మీడియా సమావేశం నిర్వహించి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోన్‌పే స్క్రీన్‌షాట్లలో కనిపిస్తున్న డబ్బులు స్టేషనరీ ఖర్చుల కోసమే తీసుకున్నవని వివరణ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే కార్యాలయ నిర్వహణ ఖర్చులకు నిధులు కేటాయిస్తుందని, అలాంటప్పుడు ఈ లావాదేవీలు నిజంగా స్టేషనరీ కోసమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. **ప్రభుత్వ నిధులు సరిపోవట్లేదా..?** స్టేషనరీ ఖర్చుల పేరుతో వ్యక్తిగతంగా డబ్బులు సేకరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు అందకపోవడమే కారణమా, లేక మరేదైనా కారణమా అన్న అంశాలపై ప్రజల్లో చర్చ సాగుతోంది. ఈ అంశాలన్నింటిపై విచారణ పూర్తయిన తర్వాతే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. **విచారణ తర్వాత కఠిన చర్యల హెచ్చరిక** విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. అవసరమైతే బ్యాంకు ఖాతాల లావాదేవీలను కూడా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.**సోషల్ మీడియాలో వైరల్ అయిన ‘సుజాతమ్మ ఫోన్‌పే కథ’** ఫోన్‌పే స్క్రీన్‌షాట్లు వైరల్ కావడంతో సోషల్ మీడియాలో ఈ వ్యవహారం పెద్ద చర్చకు దారితీసింది. “సుజాతమ్మ ఫోన్‌పే కథ“ అంటూ పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆరోపణలు, వివరణలు, రాజకీయ కోణాలపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతుండగా, ఈ వ్యవహారం వెనుక మరేదైనా కారణం ఉందా అనే చర్చ కూడా కొనసాగుతోంది.

స్థానిక పోరుకు పక్కా ప్రణాళిక



జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ పి.పి. జగదీష్ ఐపీఎస్ జూమ్ సమావేశం



అనంతపురం, అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ పి.పి. జగదీష్ ఐపీఎస్ బుధవారం జిల్లాలోని పోలీస్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించనున్న కీలక సమావేశం నేపథ్యంలో ఎస్పైలు, సీఐలు, డీఎస్పీలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు మార్గదర్శకాలు జారీ చేశారు.గ్రామాలు, పట్టణాల్లో అనవసర ఘర్షణలు, వర్గ విభేదాలు, చిన్నపాటి వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరాలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టడమే పోలీసుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.**‘పల్లె నిద్ర’తో ప్రజలకు చేరువగా**గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు అధికారులు ‘పల్లె నిద్ర’ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రాత్రి బస చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ప్రాథమిక దశలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు నిష్పాక్షికం గా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశంలో ఇచ్చే మార్గదర్శకాల ఆధారంగా జిల్లాలో పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

“ అర కొర డ్రైవింగ్ నేర్చుకో.. ఆర్సీ తెచ్చుకో..
రోడ్లపై ప్రమాదాలు చేసుకో ”

నగరంలోని అన్ని డ్రైవింగ్ స్కూల్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి

ప్రతి డ్రైవింగ్ స్కూల్‌కు చెల్లుబాటు అయ్యే అనుమతులు ఉన్నాయా పరిశీలించాలి

శిక్షణ వాహనాల పత్రాలు, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తనిఖీ చేయాలి

శిక్షణ పొందుతున్న అభ్యర్థుల డ్రైవింగ్ నైపుణ్యాన్ని కఠినంగా పరీక్షించాలి.

రద్దీ రహదారుల్లో శిక్షణ పేరుతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి

నిబంధనలు ఉల్లంఘించే డ్రైవింగ్ స్కూల్స్‌పై కేసులు నమోదు చేయాలి

బ్రోకర్ల ప్రమేయంపై విచారణ జరపాలి.

లైసెన్స్ ఇప్పిస్తామంటూ ప్యాకేజీల పేరుతో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలను పరిశీలించాలి

ప్రమాదాలకు కారణమయ్యే శిక్షణ విధానాలను నియంత్రించాలా

రోడ్లపై విచ్చలవిడిగా శిక్షణ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం.. నిబంధనలు ఎక్కడ?

అనంతపురంలో డ్రైవింగ్ స్కూల్స్ తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

సరైన శిక్షణ, టెస్టింగ్ లేకుండానే లైసెన్సులు వస్తున్నాయంటూ ప్రజల ఆవేదన

ఆర్టీవో అధికారుల పర్యవేక్షణపై తీవ్ర విమర్శలు





డ్రైవింగ్ స్కూల్ వాహనం వల్ల తీవ్రంగా గాయపడ్డ మహిళా



నుజ్జునుజైన కొత్త బైక్



టవర్ క్లాక్ నగరం నడిబొడ్డున ఇండియన్ డ్రైవింగ్ స్కూల్ లెర్నింగ్ వెహికల్ చేసిన ప్రమాదం

అనంతపురం, అక్టోబర్ 7(నేటి మినిట్ టు మినిట్): డ్రైవింగ్ నేర్పించాల్సిన డ్రైవింగ్ స్కూల్స్.. ప్రజలకు డ్రైవింగ్ భద్రతపై అవగాహన కల్పించాల్సిన సంస్థలు.. ఇప్పుడు ప్రజల ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయా? అన్న ప్రశ్నలు అనంతపురం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. శిక్షణ కోసం రోడ్లపైకి వస్తున్న డ్రైవింగ్ స్కూల్ వాహనాలు ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా, అనుభవం లేని అభ్యర్థులతో రద్దీ రహదారులపైకి వస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. **అర కొర డ్రైవింగ్‌తో అనంత లోకాలకు వెల్‌కమ్?** డ్రైవింగ్ నేర్చుకోవాలంటే క్రమబద్ధమైన శిక్షణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, ప్రాక్టికల్ టెస్టింగ్ తప్పనిసరి. అయితే కొందరు డ్రైవింగ్ స్కూల్స్ తక్కువ వ్యవధిలోనే డ్రైవింగ్ నేర్పిస్తామంటూ ప్రచారం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.“కొన్ని రోజులు శిక్షణ.. ప్యాకేజీ చెల్లింపు.. లైసెన్స్ కోసం అన్ని ఏర్పాట్లు” అన్న తరహాలో వ్యవహారం సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి విధానాల వల్ల పూర్తి స్థాయి డ్రైవింగ్ పరిజ్ఞానం లేకుండానే రోడ్డెక్కే డ్రైవర్ల సంఖ్య పెరిగితే ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **45 రోజుల్లో డ్రైవర్ రెడీనా?** కొన్ని డ్రైవింగ్ స్కూల్స్ 45 రోజుల వ్యవధిలో డ్రైవింగ్ నేర్పిస్తామంటూ ఆఫర్లు ఇస్తున్నాయని సమాచారం. అయితే ఆ శిక్షణలో అభ్యర్థికి నిజంగా ఎంత మేర ప్రాక్టికల్ నైపుణ్యం వచ్చింది? ట్రాఫిక్ పరిస్థితుల్లో వాహనాన్ని నియంత్రించగలడా? అత్యవసర పరిస్థితుల్లో బ్రేకులు, స్టీరింగ్‌ను ఎలా ఉపయోగించాలో తెలుసా? అనే అంశాలపై సమగ్రంగా పరీక్షిస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. డ్రైవింగ్ నేర్పడం ఒక వ్యాపారం కావచ్చు.. కానీ డ్రైవర్ చేతిలో ఉండేది ప్రజల ప్రాణాలు. కాబట్టి శిక్షణలో నాణ్యత, పరీక్షల్లో పారదర్శకత తప్పనిసరి అని ప్రజలు అంటున్నారు. **వైట్ ప్లేట్లతో డ్రైవింగ్ నేర్పించవచ్చా?** డ్రైవింగ్ స్కూల్ వాహనాలకు సంబంధించి నిబంధనలు ఏమిటి? శిక్షణ వాహనాలను గుర్తించే విధానం ఏంటి? రహదారులపై శిక్షణ ఇవ్వడానికి ఎలాంటి అనుమతులు అవసరం? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వాహనదారులు కోరుతున్నారు. “పేరు ఒకరిది.. ఊరు ఒకరిది.. మరి రహదారి ఎవరిది?” అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. డ్రైవింగ్ స్కూల్ పేరుతో వాహనాలను ఎక్కడ పడితే అక్కడ శిక్షణకు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. **బ్రోకర్ల చేతిలో ఆర్టీవో.. ఆర్టీవో చేతిలో బ్రోకర్లా?** అనంతపురం నగరంలో డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియలో మధ్యవర్తుల పాత్రపై కూడా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బ్రోకర్లు డ్రైవింగ్ స్కూల్స్‌తో కలిసి పనిచేస్తున్నారని, లైసెన్స్ కోసం ప్యాకేజీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. “లైసెన్స్ కావాలంటే ఈ స్కూల్‌కే వెళ్లాలి” అంటూ కొన్ని చోట్ల ప్రచారం జరుగుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? ఎవరెవరి ప్రమేయం ఉంది? అన్నదానిపై రవాణా శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. **డ్రైవింగ్ లైసెన్స్‌కు ఓ రేటు.. ప్యాకేజీల పేరుతో వసూళ్లు?** డ్రైవింగ్ స్కూల్స్‌లో డ్రైవింగ్ శిక్షణతో పాటు లైసెన్స్ ఇప్పించే పేరుతో వివిధ రకాల ప్యాకేజీలు అందిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. డ్రైవింగ్ శిక్షణ ఒక ప్యాకేజీ.. లైసెన్స్ మరో ప్యాకేజీ.. త్వరగా కావాలంటే మరో రేటు అన్నట్టుగా వ్యవహారం సాగుతోందని కొందరు వాహనదారులు వాపోతున్నారు. అయితే లైసెన్స్ జారీ ప్రక్రియలో ప్రభుత్వం నిర్దేశించిన అధికారిక ఫీజులు, పరీక్షా విధానం, డ్రైవింగ్ స్కూల్స్ వసూలు చేసే శిక్షణ రుసుములు ఏంటి? అనే అంశాలను అధికారులు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. **ఆర్టీవో కార్యాలయం ఎక్కడ? సేవలు ఎక్కడ?** ప్రమాదాలు జరిగినప్పుడు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు జరిగినప్పుడు రవాణా శాఖ అధికారులు ఎక్కడ ఉన్నారనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పగటిపూట కనిపించని తనిఖీలు.. రాత్రిపూట మాత్రమే తనిఖీలు జరుగుతున్నాయా?అనే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇవి ఆరోపణలు మాత్రమేనా? లేక వాస్తవంగా తనిఖీల్లో లోపాలున్నాయా? అన్నది అధికారిక గణాంకాలు, తనిఖీ రికార్డులు, కేసుల నమోదు వివరాలతో స్పష్టం కావాల్సి ఉంది. **“అది మా డ్యూటీ కాదు.. ప్రైవేట్ ఏజెన్సీకి ఇచ్చేశాం” అంటున్నారా?** రవాణా సంబంధిత కొన్ని సేవలు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహించబడుతున్నాయనే కారణంతో అధికారుల బాధ్యత తగ్గిపోదని ప్రజలు అంటున్నారు. ప్రైవేట్ సంస్థలకు ఏ పని అప్పగించారు? వాటి పర్యవేక్షణ ఎవరి బాధ్యత? అనుమతులు, లైసెన్సులు, శిక్షణ సంస్థల తనిఖీలు ఎవరు నిర్వహిస్తున్నారు? ఫిర్యాదులు వచ్చినప్పుడు చర్యలు తీసుకునే అధికారం ఎవరిది? అన్న ప్రశ్నలకు ఆర్టీవో అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. **డ్రైవింగ్ స్కూల్ కారుతో యువతికి ఢీ.. తీవ్ర గాయాలు** ఇటీవల జరిగిన ఒక ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించింది. తన పనిమీద వెళ్తున్న ఓ యువతిని డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన కారును నడుపుతున్న మరో యువతి ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలయ్యాయని, ఆమె వాహనం తీవ్రంగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. డ్రైవింగ్ నేర్చుకుంటున్న అభ్యర్థులను రద్దీ రహదారులపైకి తీసుకురావడంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇలాంటి ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, వాహనానికి ఉన్న అనుమతులు, డ్రైవర్‌కు ఉన్న శిక్షణ, ప్రమాదంపై నమోదైన కేసు తదితర వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది. **ప్రమాదం తర్వాత డ్రైవింగ్ స్కూల్ కారు పరారీ?** ప్రమాదం అనంతరం డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన కారు అక్కడి నుంచి వెళ్లిపోయిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే ప్రమాదం జరిగిన వెంటనే బాధితురాలికి సహాయం చేయాల్సిన బాధ్యత ఎవరిది? వాహనం ఎందుకు అక్కడి నుంచి వెళ్లింది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు పారిపోవడం కాదు.. బాధితుడిని ఆసుపత్రికి చేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ ఘటనపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. **గ్రౌండ్స్‌లో నేర్చుకోవాల్సిన డ్రైవింగ్.. రోడ్లపై ఎందుకు?** డ్రైవింగ్ శిక్షణలో ప్రారంభ దశలో అభ్యర్థులకు నియంత్రిత ప్రదేశాల్లో ప్రాక్టీస్ కల్పించడం, ఆ తర్వాత మాత్రమే రహదారులపై శిక్షణ ఇవ్వడం సురక్షితమైన విధానం. కానీ రద్దీ ప్రాంతాల్లోనే నేరుగా శిక్షణ ఇవ్వడం వల్ల ఇతర వాహనదారులు, పాదచారులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. “ముందు గ్రౌండ్‌లో నేర్పండి.. తర్వాత రోడ్డుపైకి తీసుకురండి” అని పలువురు కోరుతున్నారు. **పుట్టగొడుగుల్లా డ్రైవింగ్ స్కూల్స్.. అనుమతులు ఉన్నాయా?** అనంతపురం నగరంలో అనేక డ్రైవింగ్ స్కూల్స్ పనిచేస్తున్నప్పటికీ వాటిలో ఎన్ని చట్టబద్ధమైన అనుమతులతో నడుస్తున్నాయి? ఎన్ని సంస్థలకు చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్నాయి? వాటి వాహనాలకు అవసరమైన అనుమతులు, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు సక్రమంగా ఉన్నాయా? అన్నది అధికారులు తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఒకే పేరుతో లేదా ఒకే యాజమాన్యంతో అనేక ప్రాంతాల్లో డ్రైవింగ్ స్కూల్స్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నారు. **ప్రభుత్వం పైసలు.. ప్రైవేటు కష్టాలా?** ప్రజలకు అందాల్సిన రవాణా సేవల్లో పారదర్శకత ఉండాలని వాహనదారులు కోరుతున్నారు. లైసెన్స్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, మధ్యవర్తుల ప్రమేయం ఎందుకు కొనసాగుతోంది? డ్రైవింగ్ టెస్ట్ ప్రక్రియలో పారదర్శకత ఎంత? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. **“ఆర్టీవో అధికారులు మామూళ్లకు అలవాటు పడ్డారు”.. ప్రైవేట్ వర్గాల ఆరోపణలు** ఆర్టీవో అధికారులు నెలవారీ మామూళ్లు, వసూళ్లలో నిమగ్నమయ్యారంటూ కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.ఇలాంటి ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి కావడంతో వాటిని నిర్ధారించేందుకు స్వతంత్ర విచారణ, రికార్డుల పరిశీలన, సీసీ కెమెరా ఫుటేజీ, ఫిర్యాదుల రికార్డులు, తనిఖీ నివేదికలు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిరాధారమైతే అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కూడా పలువురు అంటున్నారు. **అనంతపురం ప్రైవేట్ రవాణా ఎవరి చేతిలో?** డ్రైవింగ్ స్కూల్స్.. ప్రైవేట్ ట్రావెల్స్.. బ్రోకర్లు.. రవాణా శాఖ.. వీరి మధ్య సంబంధాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల భద్రత కంటే వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా? డ్రైవింగ్ స్కూల్స్‌ను పర్యవేక్షించేది ఎవరు? లైసెన్స్ పరీక్షల్లో నిజంగా నైపుణ్యాన్ని పరీక్షిస్తున్నారా? అనుమతులు లేని సంస్థలపై చర్యలు ఎందుకు లేవు? ప్రమాదాలు జరిగిన తర్వాతే అధికారులు మేల్కొంటారా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా మేల్కొంటారా ఆర్టీవో అధికారులు? అనంతపురం నగరంలో డ్రైవింగ్ స్కూల్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణ స్పందన కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

ప్రజల ప్రాణాలే ముఖ్యం.. డ్రైవింగ్ స్కూల్స్ వ్యాపారం కాదు

డ్రైవింగ్ స్కూల్ అంటే కేవలం డ్రైవింగ్ నేర్పించే సంస్థ కాదు. ఒక డ్రైవర్ చేతిలో రేపు వందలాది మంది ప్రాణాలు ఉంటాయి. అందుకే శిక్షణలో రాజీ పడటం అంటే రహదారి భద్రతతో రాజీ పడటమే. అనంతపురం లో డ్రైవింగ్ స్కూల్స్‌పై వస్తున్న ఆరోపణలన్నింటినీ రవాణా శాఖ ఉన్నతాధికారులు సుమోటోగా పరిశీలించి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకోవాలి.

ఇప్పటికైనా ఆర్టీవో అధికారులు మేల్కొని డ్రైవింగ్ స్కూల్స్‌పై ఉక్కుపాదం మోపుతారా? లేక మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా? అన్నది వేచి చూడాలి.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.